
సాక్షి ప్రకాశం

బుధవారం । 10 । మే । 2023



కాటంరాజు విగ్రహావిష్కరణ నేడు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెంగళాపురం సమీపంలోని పాలేటి గంగమ్మ ఆలయం వద్ద నేడు కాటంరాజు విగ్రహావిష్కరణ చేయనున్నట్లు ఎమ్మెల్యే బుర్రా తెలిపారు. - 8లో..



ఘనంగా పాలేటి గంగమ్మ తిరునాళ్లు

పీసీపల్లి మండలం వెంగళాపురం సమీపంలో పాలేటి ఒడ్డున వెలసిన పాలేటి గంగమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35 /28

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

వాలీబాల్ సబ్ జూనియర్ క్రీడా జట్ల ఎంపిక రేపు

ఒంగోలు: వాలీబాల్ సబ్ జూనియర్ బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక ఈనెల 11న స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ జి.ధనుంజయరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఎంపిక ఉంటుందని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి ఈనెల 14 నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే రాష్ట్ర క్రీడాపోటీలకు పంపుతారన్నారు. 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులు. ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఎంపికకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు.

12న ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి బస్సులు

ఒంగోలు: ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఈనెల 12న ఉదయం 4 గంటలకు ఒకటి, 5.30 గంటలకు మరొక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో ఒకటి సూపర్ లగ్జరీ అని, మరొకటి అల్ట్రాడీలక్స్ అన్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సెలవులు ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం ఈ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు మళ్లీ రాత్రి 8 గంటలకు ట్రిపుల్ ఐటీ నుంచి ఒంగోలుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంటాయని, మరునాడు ఉదయం 2.30 నుంచి 3 గంటల మధ్యలో ఒంగోలు డిపోకు వస్తుందన్నారు. ఎవరైనా ఈ బస్సుల్లో ప్రయాణించాలని అనుకున్నవారు టికెట్లు బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

డీఎస్సీ 1998 టీచర్స్ సంఘ జిల్లా అధ్యక్షునిగా బాలిరెడ్డి

ఒంగోలు: డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షునిగా మోర్తాల బాలిరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవలే జిల్లా విద్యాశాఖ నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు స్థానిక ఎస్‌ఆర్ విద్యాసంస్థల ఆవరణలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా మోర్తాల బాలిరెడ్డి (బేస్తవారిపేట), గౌరవ అధ్యక్షునిగా పి.వీరయ్య (అద్దంకి), ప్రధాన కార్యదర్శిగా మండువ సుబ్బారావు (ఒంగోలు)తోపాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ సమావేశంలో ముఖ్యంగా మూడు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. 25 సంవత్సరాలపాటు సుదీర్ఘ పోరాటం చేసిన తరువాత మానవతా దృక్పథంతో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణ, ఎంఎల్‌సీ టి.కల్పలతారెడ్డి, డొక్క మాణిక్యవరప్రసాద్, మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జాక్టో చైర్మన్ కె.జాలిరెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఒంగోలు ఎంపీపీ పల్లప్రోలు మల్లికార్జునరెడ్డి వ్యవహరించారు.

పరిహారం.. ధీమానిచ్చే..

రైతు బాగుకోసం ఎందాకైనా అంటూ ఆరంభం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతకు అండగా నిలిచారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి రైతు ముంగిటకే అన్ని సౌకర్యాలను చేర్చితోడుగా నిలిచారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన అన్నదాతకు ఏ సీజన్‌లో పరిహారాన్ని ఆ సీజన్‌లోనే అందిస్తూ ఆదుకుంటున్నారు. నాలుగేళ్లలో రూ.146.33 కోట్లు పరిహారాన్ని రైతులు అందుకున్నారు. అంతేకాదు చంద్రబాబు ప్రభుత్వం ఎగవేసిన రూ.250 కోట్లను సైతం రైతులకు ఇచ్చి ఆదుకున్నారు.



ఏ సీజనల్‌లో పరిహారం ఆ సీజన్‌లోనే

- ప్రకృతి ప్రకోపంతో నష్టపోయిన రైతులకు అండగా
- నాలుగేళ్లలో రూ.146.33 కోట్లు అందజేత
- మొత్తం 1,83,793 మంది రైతులకు లబ్ధి
- టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ. 250 కోట్లు ఇచ్చి
- మాటతప్పిన చంద్రబాబు.. అల్లాడిన రైతాంగం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గత తెలుగుదేశం పాలకులు రైతన్నను నిర్లక్ష్యం చేస్తే..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి అన్ని రకాలుగా అండగా నిలిచింది. రైతు భరోసా మొదలు పంట నష్ట పరిహారం వరకూ సకాలంలో అందజేస్తూ ధైర్యాన్నిస్తోంది. ప్రకృతి విపత్తులు వచ్చి పంటకు నష్టం వాటిల్లితే వెంటనే అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దింపి సత్వరం అంచనాలను రూపొందించడం, పరిహారం అందించడం చకచకా జరిగిపోతోంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతోంది. అప్పటి నుంచి వరుణుడు సైతం కరుణిస్తున్నాడు. పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. దానికి తోడు నాగార్జున సాగర్ జలాలు సమృద్ధిగా అటు పంటల సాగుకు, ఇటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా రైతాంగంతో పాటు ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఏర్పడుతున్న తుఫాన్లు, అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలతో పంటలకు కొంత మేర నష్టం వాటిల్లుతోంది. అయితే ఏ సీజన్‌లో జరిగిన పంటల రాన్ని ప్రభుత్వం అందిస్తూ వస్తోంది. రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని సీఎం వైఎస్ జగన్ అధికారులను హెచ్చరిస్తూ వారికి వెన్ను దన్నుగా ఉన్నారు.

2022 రబీ సీజన్‌లో వచ్చిన మాండూస్ తుఫాను వల్ల జిల్లాలో నష్టపోయిన 28,727 మంది రైతులకు రూ.2563.61 లక్షలు మాత్రమే నష్టపరిహారం రావాల్సి ఉంది. ఆ తరువాత 2023 జనవరిలో అకాల వర్షాల వల్ల జిల్లాలో 218 మంది రైతులకు సంబంధించి రూ.28.65 లక్షలు కూడా రావాల్సి ఉంది. మాండూస్ తుఫానుకు సంబంధించిన పరిహారం నివేదికను జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి జాబితా పంపించారు. జనవరితో పాటు ఏప్రిల్, మే నెలలో వచ్చిన అకాల వర్షాలకు సంబంధించి ఎన్యూమరేషన్ జరుగుతోంది.

చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.250 కోట్లు ఇచ్చి:
చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రైతులు నష్టపోయిన నష్టపరిహారం మొత్తం రూ.250 కోట్లు జిల్లాల రైతాంగానికి ఎగ్గొట్టాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దానిని రైతులకు అందజేసింది. టీడీపీ ఐదేళ్ల పాలన అంతా కరువు కాటకాల జిల్లాలో ప్రతి ఖరీఫ్, ప్రతి రబీ సీజన్‌లో దాదాపు అన్నీ కరువు మండలాలే. పంటలు పండక, పెట్టిన పెట్టుబడులు రాక నష్టపోయిన రైతాంగానికి కనీసం పరిహారం ఇవ్వకుండానే బాబు మోసం చేశారు. అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకొని కాపురాలను గుల్ల చేసుకున్నారు.

నష్ట పరిహారం వివరాలు:

నష్టపోయిన సంవత్సరం	పంట నష్టం (హెక్టార్లు)	రైతులు	నష్టం (రూ.లక్షల్లో)
2019	878.96	1510	55.49
2020	92,350.42	1,34,623	10338.12
2021	11,986.73	18715	1647.57
2022	25,437.21	28,727	2563.61
2023	196.08	218	28.65

ఏ సీజన్‌లో నష్టం ఆ సీజన్‌లోనే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్‌లో పరిహారం ఇస్తూ వస్తున్నాం. గతంలో ఆ పరిస్థితులు ఉండేవి కావు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఇవ్వాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని కూడా ఈ ప్రభుత్వ హయాంలోనే ఇచ్చాం. ఒక్క 2022 డిసెంబర్‌లో వచ్చిన మాండూస్ తుఫాను నష్ట పరిహారం మొదలుకొని ఆ తరువాత వచ్చిన అకాల వర్షాలకు జరిగిన నష్టం మాత్రమే రైతులకు ఇవ్వాల్సి ఉంది. వాటిని కూడా ప్రభుత్వానికి నివేదికలు పంపాం. 2023 ఖరీఫ్ సీజన్ లోపే ఆ నష్ట పరిహారం కూడా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



కొనకనమిట్ల మండలం గొట్లగట్టు పొలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీరు (ఫైల్)

మోదీకి 30 మంది అవినీతి దత్త పుత్రులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ఒంగోలు: మోదీకి 30 మంది అవినీతి దత్తపుత్రులు ఉన్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఎద్దేవా చేశారు. ఒంగోలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రజల సంపదను కొల్లగొట్టి 28 మంది గుజరాతీ అవినీతి దత్తపుత్రులు విదేశాలకు పారిపోయారని, మరో ఇద్దరు అదానీ, అంబానీ అన్నారు. దేశ సంపదను దోచుకుని విదేశాలకు పారిపోతున్న ఆర్థిక నేరగాళ్లను అడ్డుకోకుండా రాచమర్యాదలతో పంపిన ఘనత మోదీకే దక్కిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తెస్తామంటూ చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కర్నాటక ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతోందని, కర్నాటక ఎన్నికల ఫలితాల తరువాత దేశంతోపాటు తెలుగు రాష్ట్రాల రాజకీయ చిత్రాలు కూడా మారిపోతాయన్నారు. పార్లమెంట్లో మోదీ, అదాని బంధాన్ని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీకి శిక్ష వేయడమే కాకుండా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసి గంటల వ్యవధిలోనే ఇంటిని కూడా ఖాళీ చేయించారన్నారు. రాహుల్‌ను చూస్తేనే మోదీ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సైతం మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. విభజన హామీలు, విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటివి ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ కూటమిగా మారి ఎన్నికలకు వెళతామని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు

- సమస్యలు నేరుగా సీఎంకు తెలిపేందుకు 'జగనన్నకు చెబుదాం'
- జిల్లాలో చర్యలను సీఎంకు వివరించిన కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఎంటి.కృష్ణబాబు, దినేష్ కుమార్, మలికాగర్గ్

ఒంగోలు అర్బన్:

ప్రజా సమస్యలు నాణ్యతతో పరిష్కరించేందుకు మండల, గ్రామ, స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ సీఎంకు తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో ప్రకాశం భవనం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సంక్షేమ పథకాల జిల్లా ప్రత్యేక అధికారి ఎంటీ కృష్ణబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఎస్పీ మలికాగర్గ్‌లతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరు నెలలుగా సచివాలయ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ యూనిట్‌లు పనిచేస్తున్నాయన్నారు. మండల స్థాయిలో అధికారులంతా సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లోనే సమస్యను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామన్నారు. దీంతో 75 శాతం సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నట్లు వివరించారు. గడిచిన ఆరు నెలలుగా అర్జీలపై అధ్యయనం చేసిన తర్వాత పరిష్కార మార్గానికి చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో పూర్తిగా పరిష్కరించకపోవడం వలన 85 శాతం అర్జీలు పునరావృతం అవుతున్నట్లు గుర్తించామన్నారు. దీనిలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఉడా చైర్‌పర్సన్ మీనాకుమారి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే

'జగనన్నకు చెబుదాం'

- మూడు సూత్రాలతో విశ్వసనీయమైన పాలన
- ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు
- మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన ఎంటి.కృష్ణబాబు, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలను నాణ్యతతో పరిష్కరించి వారి సంతృప్తిని పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వేదికగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిలుస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభావృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై నిర్వహించిన విలేకర్ల సమావేశం మంత్రి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహితం అనే మూడు సూత్రాలతో ప్రజల్లో విశ్వసనీయత చాటుతూ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం స్వయంగా దృష్టి సారించారన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సీఎం స్వయంగా విన్నారనే భావన కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఫిర్యాదులు పరిష్కరించేందుకు అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా యూనిట్ ఏర్పాటైనట్లు తెలిపారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు:
పశ్చిమ ప్రకాశంలో నీటి సమస్యపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ పశ్చిమ ప్రకాశంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నట్లు మంత్రి సురేష్ తెలిపారు. వాటర్ గ్రిడ్ కింద రూ.1400 కోట్లతో కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో తాగునీటి కోసం పనులు జరుగుతున్నాయన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వైపాలెంలో విస్తృతంగా బోర్లు వేసినట్లు తెలిపారు. తాగునీటి రవాణాకు సంబంధించి బిల్లులు మంజూరయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సుమారు రూ.132 కోట్లు పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా చూస్తామన్నారు. రూ.75 కోట్లు బిల్లులు వారంలో మంజూరవుతాయని తెలిపారు. జిల్లా కేంద్రం ఒంగోలులో తాగునీటి కోసం రూ.330 కోట్లతో అమృత్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రత్యేక అధికారి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం అప్‌డేట్ వర్షన్ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి వేదిక కానుందన్నారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీసు, సచివాలయాలు, స్థానిక సంస్థల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని గుర్తించామన్నారు. 24 గంటల్లో వాటిని పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. దీనిలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, ఉపకలెక్టర్‌లు పనిచేస్తారన్నారు. దీనిలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఎస్పీ మలికాగర్గ్ పాల్గొన్నారు.

142 సెల్‌ఫోన్లు రికవరీ

- ఇప్పటి వరకు 3447 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించాం
- వాటి విలువ రూ.5 కోట్లకుపైగానే
- మీడియా సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్



జిల్లాలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతూ వివరాలు తెలుపుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు: అధునాతన సాంకేతికత ద్వారా రికవరీ చేసిన 142 సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్పీ మలికాగర్గ్ అందించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లాలో సుమారు రూ.5 కోట్ల విలువైన 3447 మొబైల్స్‌ను గుర్తించి బాధితులకు అందించామని పేర్కొన్నారు. ఫోన్లు పోగొట్టుకుని బాధితులు పడే మనస్తాపం తీవ్రంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో వాటిని గుర్తించి తిరిగి వారికి అందజేయడం ద్వారా వారిలో సంతోషాన్ని కలుగజేస్తున్నామన్నారు. మొబైల్స్‌ను గుర్తించేందుకు బాధితులు ఒక ప్రత్యేక ఫార్మాట్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు స్వీకరించారని, వాటిని సీసీటీఎన్‌ఎస్ ద్వారా సేవా పిటిషన్లుగా నమోదు చేయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3447 మొబైల్స్‌ను ట్రేస్ చేసి బాధితులకు అందించామన్నారు. మిస్సింగ్ మొబైల్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా 7564 మిస్సింగ్ మొబైల్ ఫిర్యాదులు వచ్చాయన్నారు. మిగిలిన ఫోన్‌లను కూడా గుర్తించే పనిలో ఉన్నామని వాటిని కూడా తప్పకుండా గుర్తించి బాధితులకు అందిస్తామని చెప్పారు. ఎవరైనా విలువైన ఫోన్‌ను తక్కువ ధరకు అమ్మాలని యత్నిస్తుంటే దానిని కొనుగోలు చేయవద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా అమ్మేందుకు యత్నిస్తుంటే తక్షణమే సంబంధిత సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక వేళ సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేయాలని భావిస్తే సక్రమమైన బిల్లును చూసి కొనుగోలు చేయాలన్నారు. ఫోన్ పోయిన వారు వెంటనే పోలీసు స్టేషన్లో లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏదైనా మొబైల్ లభిస్తే వాటిని స్థానిక పోలీసుస్టేషన్లలో అప్పగించాలన్నారు. వినూత్న కార్యక్రమం ద్వారా పోగొట్టుకున్న తమ మొబైల్స్‌ను తిరిగి తమకు అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొంటూ మొబైల్స్ అందుకున్నవారు ఎస్పీ మలికాగర్గ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఐటీ కోర్ టీం ఎస్సై అజయ్‌కుమార్ టీంను ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, అదనపు ఎస్పీ శ్రీధరరావు, ఎస్‌బీ డీఎస్పీ మరియదాసు పాల్గొన్నారు.

సంక్షేమమే పరమావధిగా పరిపాలన



మల్లాపాలెంలో ఇంటింటికీ వెళ్ల సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి సురేష్

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ సురేష్

పుల్లలచెరువు: సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరాభిమానాలే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. మండలంలోని మల్లాపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయనకు గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. మంత్రి సురేష్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సమకూరిన లబ్ధిని తెలియజేశారు. గ్రామస్తులు తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం, త్రీఫేస్ విద్యుత్, సిమెంట్ రహదారి కావాలని మంత్రిని అడగడంతో స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి వెంటనే మంజూరు చేశారు. దీంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. సార్డ్ సంస్థ మంత్రి సురేష్ చేతుల మీదుగా క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ మందా లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, తహశీల్దార్ దాసు, ఏవో సుధీర్‌బాబు, ఎంఈవో శామ్యూల్‌జాన్, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాలునాయక్, ఎంపీటీసీ రాములు, నాయకులు జానకి రఘు, రవణరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, బీసీ జాతీయ సంఘం ఉపాధ్యక్షుడు గణేష్‌సింగ్, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

ఒకే కుటుంబానికి రూ.5,69,250 లబ్ధి:



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దకొడుకులా ఆదుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ పథకాల ద్వారా మా ఇంటికి రూ.5,69,250 లబ్ధిపొందాం. అందరం జగనన్నకు రుణపడి ఉంటాం.

- తమ్మినేని గాలెమ్మ, మల్లాపాలెం


వట్టివేరు పొలంలో పైపీలికలు కోస్తున్న కూలీలు


కొత్తపట్నం మండలం పిన్నింటివారిపాలెంలో సాగు చేస్తున్న వట్టివేరు పొలం


పొక్లెయినర్‌తో వట్టివేరు పంటను భూమి నుంచి తీస్తున్న దృశ్యం

వట్టిమాటలు కట్టి పెట్టి..


కాండం నుంచి వట్టివేరును వేరు చేస్తున్న మహిళా కూలీలు


ఎగుమతికి సిద్ధంగా ఉన్న వట్టి వేళ్లు


వట్టివేరు

వట్టివేరు మహత్యమే వేరు. ఖుస్ ఖుస్‌గా పిలిచే వట్టివేర్లు ఈ గడ్డి జాతి పుట్టుక భారత్ కావడం విశేషం. దీని నుంచి తీసే తైలం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో తయారయ్యే అన్ని రకాల పరిమళాల్లో కలుపుతారు. అలాగే వట్టివేరు వలన అనేక ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా ఆయుర్వేదంలో ఈ తైలం ఎక్కువగా వినియోగిస్తారు. సంతాన సాఫల్యతకు, చర్మవ్యాధులు, కీళ్లనొప్పుల నివారణకు, మొటిమలు, పుండ్ల నివారణకు వాడతారు. సువాసన వైద్యం (ఆరోమాథెరపీ)లో, పరిమళ భరితమైన తైలాలు, సబ్బులు, లోషన్లు వంటి సౌందర్య సాధనాల్లో విరివిగా వాడతారు. వేసవి కాలంలో ఇంటి గుమ్మాలకు, కిటికీలకు వట్టివేరు చాపలను వేలాడదీసి నీరు చల్లుతూ ఉంటే సువాసనభరితమైన చల్లటి గాలులు వస్తాయి. వట్టివేరు నూనెతో మర్దనా చేయడం వలన ఒంటి నొప్పులు తగ్గుతాయి. అలాగే యజ్ఞ, హోమంలో ఉపయోగిస్తారు. ఈ వేరుతో తయారు చేసిన దండలు దేవుడి విగ్రహాలకు, వివాహాలకు వినియోగిస్తున్నారు. ఎక్కువగా ఇసుక ప్రాంతాల్లో పండించే ఈ పంటను ఇటీవల ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం మండలంలోని వజిరెడ్డి పాలెం, పిన్నింటివారి పాలెం, గవండ్ల పాలెం గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎకరాకు లక్ష నుంచి లక్షన్నర రూపాయల వ్యయం అవుతుండగా 2 క్వింటాల నుంచి 3 క్వింటాల వరుకు దిగుబడి వస్తుంది. క్వింటాకు క్వాలిటీ బట్టి 90 వేల నుంచి లక్ష నలభైవేల రూపాయల గిట్టుబాటు ధర వస్తుండటంతో లాభాలను గడిస్తున్నామని రైతులు తెలిపారు. అలాగే ప్రభుత్వం నాబార్డు ద్వారా నిధులు కేటయించి వట్టివేరుతో తయారు చేసే వస్తువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని రైతులు చెబుతున్నారు.

–సాక్షి, ఒంగోలు


ఎండబెడుతున్న మహిళా కూలీలు


వట్టివేళ్లతో తయారు చేసిన దండలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


సంఘటనా స్థలంలో మృత దేహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ముండ్లమూరు: మండలంలోని రెడ్డినగర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కిలారి కోటేశ్వరరావు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని బసవాపురం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై ఉల్లగల్లు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యంలో దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో రెడ్డినగర్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈప్రమాదంలో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎల్. సంపత్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఔరంగబాదులో పట్టపగలే చోరీ


దొంగలు పగులగొట్టిన తాళాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: పట్టపగలే ఇంటికి వేసిన తాళం పగలగొట్టి రూ. 50 వేల నగదును అపహరించుకెళ్లిన సంఘటన మండలంలోని ఔరంగబాదులో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంబరపు చిన్నపిచ్చయ్య ఉదయం ఇంటికి తాళం వేసి ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చిన అతనికి తాళం పగలగొట్టి ఉండటం కనిపించింది లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులో ఉన్న రూ. 50 వేల నగదును అపహరించికెళ్ళినట్లు గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఘనంగా పాలేటి గంగమ్మ తిరునాళ్లు


పాలేటి గంగమ్మ తల్లి


చెల్లుబాటు చేయించేందుకు తీసుకొచ్చిన బొల్లావులు


గుంటిగంగకు పూజలు చేస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన పాలేటి గంగమ్మ తిరునాళ్ల 3 రోజుల నుంచి జరుగుతుండగా మంగళవారం తిరునాళ్ల ఉత్సవం భారీగా నిర్వహించారు. యాదవుల కులదైవమైన పాలేటి గంగమ్మ తల్లికి వెంగళాపురం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించుకొని గుడి దగ్గరకి తరలివచ్చారు. తిరునాళ్లు 3 శతాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. అలవలపాడులో వెలసిన గంగమ్మకు పాలేటి గంగమ్మకు చెల్లెలుగా భావించి తొలత తొలుత పెద అలవలపాడు, గుడేవారిపాలెంలో గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించి తదనంతరం పాలేటి గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. నిర్వాహకులు బొడ్డుబోయిన వంశస్తులు మాత్రమే అర్హులు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

చెల్లుబాటుకు తీసుకొచ్చిన బొల్లావులు

వివిధ ప్రాంతాల్లో వెలసిన గంగమ్మ తల్లికి జరిగే ఉత్సవాల్లో ఊరేగించేందుకు ఉపయోగించే బొల్లావులను చెల్లుబాటు కోసం భారీగా తీసుకొచ్చారు. బొల్లావులను ఊరేగించాలంటే పాలేటి నదిలో వెలసిన అమ్మవారి దగ్గర ఈ బొల్లావులకు చెల్లుబాటు అయ్యేందుకు ముద్రలు వేయించుకుంటారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు, యాదవులు, భక్తులు భారీగా హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు. కాగా బొడ్డుబోయిన వంశస్తులు, యాదవులు ప్రత్యేక వేషధారణాలతో నృత్యాలు, గుమ్మడి కాయాలతో గావుని కాశారు. భారీ అన్నదాన ఏర్పాట్లు చేశారు.

అలరించిన విద్యుత్ ప్రభలు

రాజకీయ పార్టీల వారు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు, వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వద్ద సందడి నెలకొంది. అలాగే యూత్ నాయకులు ఎంపీటీసీ చెరుకూరి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ కూడా అలరించింది. డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో 6గురు సీఐలు, 12 మంది ఎస్సైలు, 150 మంది కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు నిర్వహించారు.


వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

కాటం రాజు విగ్రహావిష్కరణ నేడు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పీసీపల్లి మండలం వెంగళాపురంలో కొలువైన ఉన్న జిల్లా ఇలవేల్పు పాలేటి గంగమ్మ తల్లి గుడి ఆవరణలో బుధవారం కాటం రాజు విగ్రహావిష్కరణ జరుగుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో మంగళవారం రాత్రి జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కనిగిరి ప్రాంతాన్ని పరిపాలించిన పేదల పక్షపాతి, ధర్మరాజు, లక్షల గోవులను సంరక్షించిన విష్ణుమూర్తి స్వరూపుడు కాటం రాజు విగ్రహావిష్కరణ ఏర్పాటుకు నియోజకవర్గంలోని యాదవులంతా వచ్చి కోరడంతో తన వంతు సహకారం అందించినట్లు వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు యాదవ్, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర, జిల్లా యాదవ సంఘ నాయకులు హాజరవుతారని చెప్పారు. సుమారు 25వేల మంది హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉదయాన్నే పొంగళ్ల మొక్కులు..

గంగమ్మ తల్లి ఆశీస్సులతోనే తాను ఎమ్మెల్యే అయ్యానని, అప్పటి ప్రతిపక్షనేత, నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా నాటి పాదయాత్ర సమయంలో గంగమ్మ తల్లి ఆశీర్వాదాలు, దీవెనలను తీసుకుని కాటం రాజు చరిత్రను ఆసక్తిగా తెలుసుకున్నారన్నారు. గంగమ్మ తల్లి కృప, ఆశీస్సుల తోనే మనస్సు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ, ప్రజా రంజక పాలనను అందిస్తున్నారని తెలిపారు. తల్లి దీవెనలతో తాను కూడా కనిగిరికి ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. పొంగళ్ల మొక్కును 10న బుధవారం ఉదయం 9 గంటలకు కుటుంబ సమేతంగా తాను తీర్చుకుంటున్నట్లు చెప్పారు. హియాలయాల్లో ఉండి వచ్చిన రామకృష్ణా స్వామి మాట్లాడుతూ కలియుగంలోనే దైవాంశ సంభూతుడిగా వెలిసిన, అవతార పురుషుడు కాటం రాజు అని పేర్కొన్నారు. గంగోత్రి నుంచి తీసుకొచ్చిన గంగా జలంతో అభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఖాసింసా, ఏ. నర్శింహారావు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులకు ఎస్పీ అభినందన


ఎస్పీ మలికా గర్గ్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యవర్గం

ఒంగోలు: ప్రకాశం జిల్లా పోలీసు ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి ఎంపికైన నూతన పాలకవర్గాన్ని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. నూతనంగా ఎంపికైన పాలకవర్గం మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఉపాధ్యక్షులు ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, కార్యదర్శి ఆర్ఐ వెల్ఫేర్ జె.హరిబాబుతో పాటు ఇతర సభ్యులున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత్ సురాన పాల్గొన్నారు.

2 కేజీల గంజాయి స్వాధీనం

ఒంగోలు: అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరి నుంచి 2 కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వేస్టేషన్లో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఒంగోలు ప్రభుత్వ రైల్వే పోలీసుస్టేషన్ సీఐ ఎండ్లూరి రామారావు, ఎస్సై వెంకటేశ్వర్లు వారి సిబ్బందితో కలిసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. తుని ప్రాంతం నుంచి స్వీకరించి రైలులో తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడి పరిసర ప్రాంతాలకు వెళ్లి అక్కడ చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మడానికి తీసుకువెళుతున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన ఇరువురు కృష్ణా జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన ఈగల బాలకృష్ణ, విశాఖ జిల్లా రోలుగుంట మండలం ముచ్చంపేట గ్రామస్తులు మొగ్గ రామారావుగా గుర్తించారు. సీజ్‌చేసిన గంజాయి విలువ రూ. 8వేలు ఉంటుందని తెలిపారు.

కోర్టు ఆవరణ నుంచి ఇద్దరు ఖైదీల పరారీ

- అందులో ఒకరు పట్టివేత
- పరారీలో మరో ఖైదీ
- కోర్టు కానిస్టేబుల్స్‌ను నెట్టి, కింద పడేసి పరారైన వైనం

కనిగిరి రూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నుంచి ఇద్దరు ఖైదీలు పరారుకాగా, అందులో ఒకర్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మంగళవారం జరిగింది. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ చోరీ కేసుల్లో ఖైదీలైన ముగ్గురు దొంగలను కనిగిరి కోర్టులో హాజరు పరిచేందుకు ఒంగోలు జైలు నుంచి తీసుకొచ్చారు. మొదట పోలీసులు ఒక ఖైదీని కోర్టులో ప్రవేశపెట్టారు. మిగతా ఇద్దరు ఖైదీలను పోలీసులు పట్టుకుని కోర్టు ఆవరణలో ఉన్నారు. ఈక్రమంలో ఒక్కసారిగా ఇద్దరు కానిస్టేబుళ్లను నెట్టి కోర్టు వెనుక గోడలు దూకి పరారయ్యారు. వెంటనే అధికారుల మౌఖిక ఆదేశాల మేరకు సీఎస్‌పురం కోర్టు కానిస్టేబుల్ రామాంజనేయులు, పీసీపల్లి కోర్టు కానిస్టేబుల్ తిరుపతినాయుడులు ఖైదీలను వెంబడించారు. పట్టణానికి సుమారు 4 కి.మీల దూరంలో కలగట్ల రోడ్డు సమీప పొలాల్లో ఖైదీ మేకల మహేంద్రను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఖైదీలు వీరిపై తిరగబడి, రాళ్లతో దాడికి ప్రయత్నించారు. అయినా పోలీసులు వదలకుండా ఒకర్ని పట్టుకోగా, మరోక ఖైదీ దుర్గరావు పరారయ్యాడు. ఈమేరకు దొరికిన ఖైదీ మహేంద్రను కనిగిరి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈక్రమంలో కనిగిరికి చెందిన ఇద్దరు కోర్టు కానిస్టేబుల్స్‌కు, ఒంగోలుకు చెందిన ఇద్దరు కోర్టు కానిస్టేబుల్‌లు వై. స్వామి దాసు, పి. సత్యంకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాలను పణంగా పెట్టి వెంబడించి ఖైదీని పట్టుకున్న కనిగిరి కోర్టు కానిస్టేబుళ్లు రామాంజనేయులు, తిరుపతి రావులను జడ్జి అభినందించారు.


మహేంద్రను పట్టుకున్న కానిస్టేబుల్స్ వీరే

పీసీపల్లి వాసులే..

పరారీలో ఉన్న ఖైదీ ఆర్. దుర్గరావుది పీసీపల్లి మండలం నేరేడుపల్లి కాగా, పోలీసులకు దొరికిన ఖైదీ మేకల మహేంద్రాది పీసీపల్లి మండలం మురిగమ్మి. వీరిద్దరూ అనేక దొంగతనాల కేసుల్లో నిందితులుగా తెలిసింది. వీరిపై సుమారు 30కి పైగా దొంగతనం నేరాలు ఉన్నట్లు సమాచారం. పరారైన ఖైదీ దుర్గరావును పట్టుకునేందుకు పోలీసులు మూడు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు.